నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
3 | వరంగల్, ఆదివారం 17 నవంబర్ 2024 | MAHABUBABAD

జనగామకు జుడా ఎమ్మెల్యే పల్లా చొరవే

తొలుత 'కుడా'లో విలీనానికి వచ్చిన ప్రతిపాదన

- అన్ని వర్గాలతో స్థానిక ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి సంప్రదింపులు
- అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ ఏర్పాటుకు లేఖ

జనగామ, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : జనగామకు జుడా(జనగామ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటుచేయాలన్న స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నం ఫలించింది. మున్సిపల్ వార్డులు సహా చుట్టు పక్కల 3నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలను కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)లో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరించకుండా అన్ని పక్షాలతో చర్చించి తీసుకున్న నిర్ణయాన్ని లేఖ రూపంలో తెలియజేయడంతో జుడా ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ప్రస్తుతం ఉన్న 30 మున్సిపల్ వార్డులు సహా పట్టణానికి నలువైపులా ఉన్న శామీర్‌పేట, పెంబర్తి, యశ్వంతాపూర్, ఎల్లంల గ్రామాలను కుడాలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను అంగీకరించకుండా అందరి అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దీనిపై కొద్దిరోజుల క్రితం జనగామలోని తన క్యాంపు కార్యాలయంలో అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, వివిధ వర్గాల మేధావులు, విద్యావేత్తలు, డాక్టర్లు, న్యాయవాదులు, జర్నలిస్టులు, కుల సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు, ఆయా జేఏసీ, కార్మిక సంఘాలు, వివిధరంగాల నిపుణులతో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సమావేశమై మున్సిపల్ సహా చుట్టుపక్కల గ్రామాలను కుడాలో విలీనం చేయాలన్న ప్రతిపాదనపై అభిప్రాయ సేకరణ జరిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జిల్లాకేంద్రంగా ఏర్పడిన జనగామకు స్వయం ప్రతిపత్తి ఉంటేనే ప్రణాళికాబద్ధమైన పట్టణ విస్తరణ, అభివృద్ధి సాధ్యమన్న మెజార్టీ వర్గాల అభిప్రాయాన్ని తిరిగి లేఖ రూపంలో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రైలుమార్గం సహా నాలుగు రాష్ట్రాలను కలిపి రెండు హైవేలు ఉన్న జనగామ పట్టణం హైదరాబాద్‌కు అతి సమీపంలో గ్రోత్ కారిడార్‌గా ఉందని సాంకేతిక ఆధారాలతో గణాంకాలతో కూడిన నివేదిక సర్కారుకు పంపడంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా తీసుకున్న చొరవ కారణంగానే ప్రత్యేకంగా 'జుడా'కు బీజం పడింది. బీఆర్ఎస్ సర్కారు పాలనలో జిల్లాల పునర్విభజన తర్వాత పట్టణీకరణలో భాగంగా సమీప గ్రామాల విలీనం తర్వాతే స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంతో పంచాతీయల విలీనం, నగర పంచాయతీలకు స్థాయి పెంపు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటు అంశాలు 2017లో తెరపైకి వచ్చిన సమయంలో సాంకేతిక, కోర్టు వివాదాల కారణాలతో అప్పటి ప్రతిపాదనలు వెనక్కి వెళ్లిన అంశాన్ని కూడా ఉటంకించారు. దీనిపై గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అధికారి (డీటీసీపీవో), ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు సభ్యులుగా ప్రత్యేక కమిటీ సమావేశమైందన్న అంశాన్ని గుర్తుచేశారు. జిల్లాకేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011 జనాభా, 2024 ప్రస్తుత జనాభా అంచనా, ఏరియా వంటి వివరాలతో కూడిన ప్రతిపాదిత ప్రణాళికను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా అప్పట్లో ప్రభుత్వానికి పంపిన నివేదికను కూడా స్థానిక ఎమ్మెల్యే తన లేఖలో ప్రస్తావించడంతో జనగామ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (జుడా) ఏర్పాటుకు సర్కారు సిద్ధమైంది.

సొసైటీలో ఏం జరుగుతోంది?

- రుణాల మంజూరులో అధికార పార్టీ నేతల జోక్యం
- ప్రశ్నించిన చెన్నారావుపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ వంశీ
- అరెస్ట్ చేయించిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

చెన్నారావుపేట, నవంబర్ 15: చెన్నారావుపేట ప్రాథమిక సహకార సంఘంలో రైతులకు రుణాల మంజూరు విషయంలో అధికార పార్టీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని వైస్ చైర్మన్ చింతకింది వంశీ ధ్వజమెత్తారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో అర్హులైన రైతులందరికీ రుణాలు అందజేస్తామని చెబుతున్న అధికార పార్టీ నేతలు జోక్యం చేసుకొని రుణాలు ఇవ్వకుండా ఆపాలని చూస్తున్నారని ఆరోపించారు. సొసైటీ వారోత్సవాల్లో భాగంగా శనివారం కార్యాలయ ఆవరణలో చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం డైరెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి సంఘం అభివృద్ధి, రైతులకు రుణాల మంజూరుపై చర్చించారు. ఈ సమయంలోనే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, అతడి సోదరుడు సొసైటీ కార్యాలయానికి చేరుకొని తమ అనుచరులకు ముందుగా రుణాలు ఇవ్వాలని డైరెక్టర్లతోపాటు తనతో వాగ్వాదానికి దిగినట్లు వంశీ తెలిపారు. గొడవ ముదరడంతో నర్సంపేట సీఐ రమణమూర్తి, నెక్కొండ ఎస్సై మహేందర్, చెన్నారావుపేట పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతిపజేసినట్లు చెప్పారు. పైరవీలు లేకుండా రుణాలు ఇస్తామని, ఏ పార్టీ జోక్యం చేసుకోవద్దని వైస్ చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే.. సొసైటీలో రుణాల మంజూరు విషయంలో అధికార పార్టీ నాయకుల జోక్యాన్ని పీఏసీఎస్ వైస్ చైర్మన్ వంశీ ప్రశ్నించాడు. దీన్ని జీర్ణించు కోలేని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూ క్యా గోపాల్‌నాయక్.. తనపై వంశీ దుర్భాషలాడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశా డు. దీంతో పోలీసులు వంశీతోపాటు బీఆర్ఎస్ నేత నరేందర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం రాత్రి నెక్కొండ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకొని నెక్కొండకు ఎందుకు తరలించారని పోలీసులను నిలదీశారు. సీఐ వారికి సర్దిచెప్పి పంపించా రు.

కోట్ల రూపాయలే గొడవకు కారణమా?

అసలు చెన్నారావుపేట సొసైటీలో ఏం జరుగుతోందని రైతులు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో వచ్చిన రుణమాఫీ డబ్బులు, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ డబ్బులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన కమీషన్ కలిసి సుమారు రూ. 8కోట్లు సొసైటీ ఖజానాలో ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే, కాంగ్రెస్ నాయకులతో నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాతే సొసైటీ డబ్బులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అధికార పార్టీ నాయకులు సీఈవోపై ఒత్తిడి తెచ్చిన సందర్భాలూ ఉన్నాయి. సొసైటీలోని డబ్బులను ఖర్చు చేయాలంటే అధికారం కావాలి. ఇందుకోసం ఇప్పటి నుంచే రైతుల వద్ద మంచి పేరు సంపాదించడం కోసం రుణాల మంజూరులో కాంగ్రెస్ నాయకులు ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారని ఇతర పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సొసైటీని కాపాడుతూ తమను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

క్లిక్ చేస్తే బుక్కైనట్లే!

సోషల్‌మీడియా వేదికగా..రెచ్చిపోతున్న సైబర్ నేరస్తులు

'మా కంపెనీలో మనీ ఇన్వెస్ట్ చేయండి.. లక్షకు లక్ష పొందండి.., మా వస్తువులు కొనండి.. ఫ్రీ గిఫ్ట్‌లు, డిస్కౌంట్లు ఇస్తాం'.., అంటూ సెల్‌ఫోన్లకు సోషల్ మీడియాలో వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేశారో.. అంతేసంగతులు.. ఇంకేముంది మీ బ్యాంక్ ఖాతాను మొత్తం ఊడ్చేసేదాకా వదలరు. అంతేగాక నిత్యం మనం వాడే ఫోన్‌పే యాప్ కూడా నకిలీవి పుట్టుకురావడంతో వాటితోనూ అమాయకులను నిండా ముంచేస్తున్నారు. అదీ గాక ఈ మధ్య మేము సీబీఐ, కస్టమ్స్ అధికారులంటూ వాట్సాప్ వీడియో కాల్స్ చేసి మరీ జనాన్ని భయపెడుతూ అందినకాడికి దోచుకునేందుకూ సైబర్ నేరగాళ్లు వెనకాడడం లేదు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో మనం 'స్మార్ట్'గా లేకపోతే సైబర్ నేరగాళ్ల ఎరకు చిక్కినట్టే. లేకపోతే చేజేతులా మోసపోవాల్సి వస్తుంది. నిరక్షరాస్యులు, అమాయకులే కాదు.. ఉన్నత విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ వీరి వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇటీవలి కాలంలో ఈ తరహా నేరాలు పెరిగిపోయాయి. అత్యాశకుపోయి చాలామంది లక్షల్లో డబ్బులు పోగొట్టుకొని తలలు పట్టుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక చోట కొత్త రకం మోసాలు వెలుగు చూస్తుండగా, వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఆరు నెలల్లోనే 136 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

- సుబేదారి, నవంబర్ 16



ఫ్రీ టాస్క్.. రూ.54లక్షలు మటాష్

హనుమకొండకు చెందిన ఓ ప్రొఫెసర్ తన సెల్‌ఫోన్ వాట్సాప్‌కు వచ్చిన యాడ్ మనీ ఇన్వెస్ట్‌మెంట్ చూశాడు. అతడికి సైబర్ నేరస్తుడు తొలుత ఫ్రీ టాస్క్ అని చెప్పి అకౌంట్ క్రియేట్ చేసి కొంత డబ్బు పంపి నమ్మించాడు. ఇక పెయిడ్ టాస్క్ చేయండి.. రూ.25 వేలు పెట్టుబడి పెడితే రూ.50వేలు వస్తాయి. రూ.లక్ష పెడితే రూ.రెండు లక్షలని నమ్మించాడు. సదరు ప్రొఫెసర్ ఏకంగా రూ.54,43,000 పెట్టుబడి పెట్టాడు. ఇంకేముంది.. నంబర్ బ్లాక్ చేసి డబ్బులు డ్రాచేశాడు. మోసపోయానని తెలుసుకున్న ప్రొఫెసర్ వరంగల్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశాడు.

వాట్సాప్ లింక్‌తో రూ.12 లక్షలు..

హనుమకొండ జూలైవాడకు చెందిన భార్యభర్తలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఇటీవల వీకెండ్‌కు ఇంటికి వచ్చారు. వివాహిత ఫోన్ వాట్సాప్‌కు లింకు వచ్చింది. మనీ ఇన్వెస్‌మెంట్‌లో ముందు రూ.లక్ష పెట్టుబడి పెట్టింది. రూ.2లక్షలు వచ్చినట్లు సైబర్ నేరస్తుడు అకౌంట్‌లో చూపించాడు. ఇలా గంటలో రూ.12 లక్షలు వరకు పెట్టుబడి పెట్టింది. సైబర్ నేరస్తుడు ఆమె అకౌంట్‌ను బ్లాక్ చేసి డబ్బులు డ్రా చేశాడు.

మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.3 లక్షలు

మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో హనుమకొండ హంటర్‌రోడ్డుకు చెందిన ఓ యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ప్రకటన చూసి షేర్ మార్కెట్ పేరుతో రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయింది.

కస్టమ్స్ ఆఫీసర్ అని చెప్పి..

వరంగల్‌కు చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరస్తుడు ఫోన్ చేసి.., కస్టమ్స్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని చెప్పడంతో నమ్మి బ్యాంకు ఖాతా, ఫోన్, ఆధార్ కార్డు వివరాలు చెప్పాడు. వెంటనే అతడి ఖాతా నుంచి రూ.8 లక్షలు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ రావడంతో అతడు వెంటనే వరంగల్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సైబర్ నేరస్తుడి అకౌంట్‌ను బ్లాక్ చేసి రూ.5 లక్షలు డ్రా చేయకుండా ఆపేశారు. కోర్డు ద్వారా బాధితుడికి ఇప్పించాడు. ఈ మోసం రెండు నెలల క్రితం జరిగింది.

కేసముద్రంలో ఫేక్ ఫోన్ పే మోసం

కేసముద్రం మండల కేంద్రంలోని టైర్లషాపులో ఓ వ్యక్తి రూ.3800లకు రెండు టైర్లు కొన్నాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు పంపినట్లు యజమానికి సెల్‌ఫోన్‌లో స్క్రీన్ చూపించి టైర్లు తీసుకొని వెళ్లిపోయాడు. తీరా షాపు యజమాని ఫోన్ పేలో పరిశీలించగా ఖాతాలో డబ్బులు జమకాలేదు. తాను మోసపోయానని యజమాని వాపోయాడు.

- మనీఇన్వెస్ట్‌మెంట్, జాబ్, డిస్కౌంట్ ఆఫర్లతో ఎర..
- కొత్తగా సీబీఐ, కస్టమ్స్, మ్యాట్రిమోనీ పేరుతో మోసం
- రూ.లక్షలు పోగొట్టుకుంటున్న అమాయకులు
- ఉన్నత విద్యావంతుల నుంచీ సామాన్య ప్రజానీకం వరకు బాధితులే..

డిజిటల్ విప్లవం, సోషల్ మీడియా ప్రపంచాన్నే ఓ కుగ్రామంగా మార్చివేసింది. ఇప్పుడు అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటేచాలు ప్రపంచమే మన కళ్లముందు ఉండేలా సాంకేతికత అభివృద్ధి చెందింది. అయితే, దీంతో ఎన్ని లాభాలు ఉన్నాయో.. అంతేస్థాయిలో మోసాలూ ఉన్నాయి. అప్రమత్తంగా లేకపోతే సైబర్‌నేరగాళ్లు నిలువునా దోచేస్తారు. టెక్నాలజీ అప్‌డేట్ అవుతున్నకొద్దీ సైబర్ నేరస్తులు కూడా కొత్త రకం మోసాలు చేయడానికి ట్రెండ్ ఫాలో అవుతున్నారు. ఉన్నత విద్యావంతుల నుంచి సాధారణ ప్రజానీకం వరకు అత్యాశకు పోయి సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి లక్షలు పోగొట్టుకొని తలలు పట్టుకుంటున్నారు. ఫోన్‌కు లింకులు పంపించడం, ప్రకటనలు, బ్యాంక్ అకౌంట్ కేవైసీ అప్‌డేట్ చేస్తామని చెప్పడం, తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు(మనీ ఇన్వెస్ట్‌మెంట్), వస్తువుల కొనుగోళ్లపై డిస్కౌంట్ ఆఫర్స్, జాబ్ అవకాశం కల్పిస్తామంటూ రకరకాల యాప్‌లు, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, టెలిగ్రామ్ వేదికగా ఎరవేసి అందినకాడికి దోచుకుంటున్నారు. తాజాగా, సీబీఐ ఆఫీసర్లమంటూ డిజిటల్ అరెస్ట్ ద్వారా డబ్బులు లాగుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోజుకు సగటున 10 నుంచి 15 సైబర్ క్రైం కేసులు నమోదవుతున్నాయి. సైబర్ నేరస్తుల వలలో పడి బాధితులు రూ.లక్షలు పొగొట్టుకొని ఆత్మహత్యల దాకా వెళ్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, వాట్సాప్ లింకులు, ఓటీపీ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దంటూ పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నా, కొందరు అత్యాశకు పోయి డబ్బులు పొగొట్టుకుంటున్నారు. సైబర్ మోసాలను అడుగడుగునా తీసుకొని కొందరు పరిచయం ఉన్న అమ్మాయిల వాట్సాప్ డీపీ, ఫేస్‌బుక్ ఫొటోలు మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫొటోస్‌తో బ్లాక్ మెయిల్ చేస్తున్న తీరు ఇటీవల కమిషనరేట్ పరిధిలో వెలుగు చూసింది. హనుమకొండలో ఓ యువతి వాట్సాప్ డీపీని బాగా పరిచయమున్న వ్యక్తి టెలిగ్రామ్ డీపీగా పెట్టి, ఆ అమ్మాయి లవ్ చేసినట్లు అబ్బాయిలతో చాట్ చేసి డబ్బులు లాగాడు. మరో యువకుడు తెలిసిన అమ్మాయి ఫేస్‌బుక్ ఫొటోలతో మార్ఫింగ్ చేసి రొమాంటిక్ పిక్స్‌తో సోషల్ మీడియాలో పెట్టి బ్లాక్ మెయిల్ చేశాడు. ఇలా సైబర్ నేరస్తుల బారిన పడి మోసపోయిన బాధితులు న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు క్యూ కడుతున్నారు. రూ.10 లక్షలు అంతకంటే ఎక్కువగా మోసపోయిన బాధితులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కమిషనరేట్ కార్యాలయంలో సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌ను ప్రారంభించారు. ఇప్పటి వరకు ఈ స్టేషన్‌లో 136 కేసులు నమోదయ్యాయి. 11 కేసుల్లో రూ.16 లక్షలు కోర్టు ద్వారా బాధితులకు డబ్బులు ఇప్పించారు.



ఆన్‌లైన్ పెళ్లిచూపులతో మోసం

హనుమకొండ ఎన్జీవోస్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుమారుడు కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి పెళ్లి సంబంధాలు చూస్తుండగా, ఆన్‌లైన్‌లో ఏపీ కొల్లూరుకు చెందిన యువతి కనెక్ట్ అయింది. అమ్మాయి అందంగా కనిపించడంతో ఇష్టపడ్డాడు. పెళ్లి చూపుల కోసం ఇద్దరు హనుమకొండలో నెల క్రితం కలుసుకుందామని డేట్ ఫిక్స్ చేసుకున్నారు. మా డాడీ రియల్ ఎస్టేట్ రంగంలో డబ్బులు పెట్టుబడి పెట్టాడు. ఇబ్బందుల్లో ఉన్నాం. పెళ్లి చూపులకు వరంగల్ రావాలంటే నాకు గోల్డ్ కావాలి. గోల్డ్ లేకుంటే మీ ఫ్యామిలి ఇష్టపడరు. నాకు రూ.రెండున్నర లక్షలు ఇవ్వు.. పెళ్లిసమయంలో ఇచ్చేస్తానని యువతి నమ్మించడంతో అతడు డబ్బులను ఆమె అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. వెంటనే ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో మోసపోయానని గ్రహించిన ఆ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీబీఐ అధికారి పేరుతో డిజిటల్ అరెస్ట్

హనుమకొండకు చెందిన ఓ సీనియర్ సిటిజన్‌కు కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. తాను ముంబాయి నుంచి సీబీఐ ఆఫీసర్‌ను మాట్లాడుతున్న.. మీపై సీబీఐ కేసు రిజిస్టర్ అయింది. మీ వివరాలు చెప్పండి.. అరెస్ట్ చేయకుండా ఉండాలంటే మాకు కావాల్సినంత డబ్బులు ఇవ్వండి.. లేదా మా వాళ్లు మీ దగ్గరికి వచ్చి అరెస్ట్ చేసి ఇక్కడి తీసుకొస్తారని వీడియోకాల్‌లో బెదిరించాడు. దీంతో అతడు భయపడి రూ.50వేలు సైబర్ నేరస్తుడు నంబర్ పంపిన యూపీఏ నంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు.

ఫ్రీగిఫ్ట్ లింకుతో రూ.2లక్షలు ఫట్

హనుమకొండ రాంనగర్‌కు చెందిన ఓ యువకుడి ఫోన్ వాట్సాప్‌కు సైబర్ నేరస్తుడు ఫ్రీగిఫ్ట్ లింకు పంపించాడు. ఆ యువకుడు తన వివరాలు, బ్యాంకు ఖాతా నంబర్‌తో సహా లింకులో అప్‌లోడ్ చేశాడు. కానీ, ఆన్ సక్సెస్ అని అతడికి మెసేజ్ వచ్చింది. వెంటనే సైబర్ నేరస్తుడు అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.2 లక్షల 8వేలు డ్రా చేశాడు.

సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలి

ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. స్మార్ట్ ఫోన్ వాడకం అనేది తప్పనిసరి కావడంతో ప్రతి ఒక్కరూ సైబర్ నేరస్తులపై జాగ్రత్తగా ఉండాలి. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌లో వచ్చే అనవసరమైన లింకులు, ప్రకటనలను ఓపెన్ చేయొద్దు. వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పొద్దు. ఒకవేళ మోసపోతే వెంటనే గోల్డెన్ అవర్ గంటలో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930 లేదా, వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలి. అలా చేస్తే సైబర్ నేరస్తుడు డబ్బులు డ్రా చేయకుండా అకౌంట్‌ను బ్లాక్ చేయొచ్చు. కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 136 ఫిర్యాదులు అందాయి. 11 కేసుల్లో రూ.16లక్షలు బాధితులకు కోర్టు ద్వారా ఇప్పించాం. రాజస్థాన్‌కు చెందిన 12 మందిని, తమిళనాడుకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు పంపించాం. సైబర్ నేరస్తుల్లో ఎక్కువగా ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా, యూపీ, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. కొందరు ఇతర దేశాలకు చెందిన వారు కూడా ఉన్నారు.

– కే విజయ్‌కుమార్, సైబర్ క్రైం ఏసీపీ, వరంగల్ పోలీసు కమిషనరేట్

నకిలీ వైద్యుడి పట్టివేత

అధికారులకు అప్పగించిన వైద్య మండలి సభ్యులు

వరంగల్ చౌరస్తా, నవంబర్16 : సామాజిక మాధ్యమాల్లో డాక్టర్‌గా చెలామణి అవుతూ ఎలాంటి శాస్త్రీయ తలేని వైద్య సలహాలు, సూచనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న నకిలీ వైద్యుడు వేములవలస రాంబాబును తెలంగాణ వైద్య మండలి పట్టుకుంది. హైదరాబాద్ దోమలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి (సాయివాణి హాస్పటల్)లో కాంపౌండర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఆల్ ఇన్ వన్ రామ్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతాను ఏర్పాటు చేసుకొని ఎలాంటి విద్యార్హతలు లేకున్నా వైద్య సూచనలు, సలహాలను ప్రచారం చేస్తున్న విషయాన్ని గుర్తించి తెలంగాణ వైద్య మండలి సభ్యులు శనివారం పట్టుకొని అధికారులకు అప్పగించారు. అంబులెన్స్‌లో అవసరమైన ఫస్ట్ ఎయిడ్ శిక్షణ తీసుకున్న వ్యక్తి వైద్య సలహాలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడని మండలి ప్రతినిధులు తెలిపారు. నిందితుడిపై ఎన్ఎంసీ చట్టం 34, 54, టీఎస్ ఎంపీఆర్ చట్టం 22 ప్రకారం కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న వారిలో వైద్యమండలి సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఇమ్రాన్ అలీ, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ తదితరులున్నారు.

నకిలీ వైద్యుడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న తెలంగాణ వైద్యమండలి ప్రతినిధులు

మోడల్ స్కూల్ టీచర్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన అడిషనల్ డైరెక్టర్

నర్మెట, నవంబర్ 16 : జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు కరుణాకర్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ప్రిన్సిపాల్ పుష్పకుమారి శనివారం తెలిపారు. సదరు ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఇటీవల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టి ప్రిన్సిపాల్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ విషయమై పూర్తి స్థాయి విచారణ చేపట్టిన అధికారులు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

పూజల పేరిట మోసం చేసిన ముఠా అరెస్ట్

- ఐదుగురు నిందితుల నుంచి రూ. 34.36 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్

జనగామ చౌరస్తా, నవంబర్ 16 : దోష నివారణ పూజలు చేస్తామని నమ్మించి రూ. 55 లక్షలు కొల్లగొట్టిన ఐదుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. నిందితుల నుంచి 30 తులాల బంగారం, 20 తులాల వెండి, 4.6 గ్రాముల ముత్తూట్ గోల్డ్ లోన్ ప్రతాలు, రెండు ల్యాండ్ డాక్యుమెంట్లు, ఒక ఎర్టిగా కారుతో కలిపి మొత్తంగా రూ. 34.36 లక్షల సొత్తును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. శనివారం జనగమ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ నిందితుల వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సత్యనారాయణపురంకు చెందిన ట్రాన్స్‌జెండర్ భట్టు నాగదేవి (నాగమణి), జనగామ జిల్లా కేంద్రంలోని బాణాపురం ఏరియాకు చెందిన పాముకుంట్ల సందీప్, మెతుకు గణేశ్, ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పాలంపల్లి తండాకు చెందిన గుగులోత్ నవీన్, భాగ్యనగర్‌కు చెందిన భూక్యా గణేశ్ ముఠాగా ఏర్పడి దోష నివారణ పూజలు చేస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టించడం అలవాటుగా చేసుకున్నారు. ఈ క్రమంలో గత జూన్ 1న జనగామ జిల్లా కేంద్రంలోని వెంకన్నకుంటకు చెందిన సిరివెన్నెల తనకు పరిచమున్న మహిళలకు బాబు పుడితే చూడడానికి వెళ్లింది. అక్కడ సిరివెన్నెలకు నాగదేవి పరిచయమై మీ ఇంట్లో దోషాన్ని పోగొడతానని మాయమాటలతో నమ్మించి, బాధితురాలితో పాటు ఆమె సోదరుడు నిఖిల్ ఇంట్లో పూజలు చేసి వారి నుంచి రూ.55 లక్షలతో పాటు రెండు ప్లాట్ల డాక్యుమెంట్లు తీసుకుంది. ఈ విషయమై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఎర్టిగా క